



# 5. నీతి పరిమళాలు

**-వివిధ కవులు**

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

1. మీకు తెలిసిన ఏవైనా నీతి వాక్యాలు తెల్పండి?
2. నీతులు ఏ ఏ రూపాల్లో ఉంటాయి?
3. వందకుపైగా పద్యాలుండే ప్రక్రియను ఏమంటారు?
4. మకుటం అంటే ఏమిటి ?
5. మకుటం ఏ రకంగా ఉండవచ్చు ?
6. మీకు తెలిసిన నీతిశతకాల గురించి చెప్పండి.
7. మీకు తెలిసిన శతక కవుల పేర్లు చెప్పండి.
8. శతకాలలో కేవలం నీతిని బోధించేవే ఉంటాయా? వివరించండి.
9. ఇంతవరకు మీరు కంఠస్థం చేసిన పద్యాల్లో ఏ ఏ శతకాల పద్యాలున్నాయి. ?

© SCERT not to be republished

### ఉద్దేశం

శతకపద్యాలు సమాజం పోకడలను తెలుపుతాయి. మనిషి ఎలా జీవించాలో చెబుతాయి. వీటి ద్వారా విద్యార్థులలో నైతిక విలువల్ని పెంపొందించటమే ఈ పాఠం ఉద్దేశం.

**ఈ పాఠంలోని పద్యాలు వివిధ కవులు రాసిన శతకాల లోనివి.**

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
2. సందర్భానికి తగిన అర్థాలు గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
3. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

*చ. తనకు ఫలంబు లేదని యెదందలపోయఁడు కీర్తిఁ గోరు నా
ఘనగుణశాలి లోకహితకార్యము మిక్కిలి భారమైన మే
లనుకొని పూను, శేషుఁడు సహస్ర ముఖంబుల గాలి గ్రోలి తా
ననిశము మోవఁడే మఱి మహాభరమైన ధరిత్రి భాస్కరా! 1
(భాస్కరశతకం)





*చ. చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతులెవ్వరు మెచ్చ రెచ్చటం
బదనుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పు లేక రుచి పుట్టఁగ నేర్చునటయ్య భాస్కరా! 2
(భాస్కరశతకం)

*ఉ. భూషలు గావు, మర్త్యులకు భూరిమయాంగద తారహారముల్
భూషిత కేశపాశ మృదుపుష్ప సుగంధజలాభిషేకముల్
భూషలు గావు పూరుషుని భూషితుఁ జేయుఁ బవిత్రవాణి, వా
గ్భూషణమే సుభూషణము, భూషణముల్ నశియించు నన్నియున్.
(సుభాషిత రత్నావళి) 3





*చ. వనకరి చిక్కె మైనసకు, వాచవికిం జెడిపోయె మీను, తా
వినికికిఁ జిక్కెఁ జిల్వ గనువేదురుఁ జెందెను లేళ్ళు, తావినో
మనికి నశించెఁ దేఁటి, తరమా యిరుమూటిని గెల్వ నైదుసా
ధనముల నీవె గావఁదగు దాశరథీ కరుణాపయోనిధీ ! 4
(దాశరథీశతకం)

© SCERT not to be republished



*ఆ.వె. క్షమను కడcక నెవరు గాపాడుకొందురో
క్షమను చిరము వారు కావ గలరు
కదలకుండ నెవరికడ క్షమcయుండునో
సర్వకార్యములకు క్షములు వారు 5

(సభారంజన శతకం)



*శా. ఊరూరం జనులెల్ల భిక్షమిడరో, యుండం గుహల్గల్గవో
చీరానీకము వీధులం దొరకదో శీతామృత స్వచ్ఛ వాః
పూరం బేరుల బారదో తపసులం బ్రోవంగ నీవోపవో
చేరంబోవుదు రేల రాజుల జనుల్ శ్రీకాళహస్తీశ్వరా ! 6

(శ్రీకాళహస్తీశ్వర శతకం)



సీ. దుష్టు సూర్యుని దెస దుమ్మెత్తి జల్లినc
దనపైనె పడుcగాక దానికేమి
కొండతోc దగరు ఢీకొని యెంత తాcకినc
దల వ్రక్కలగుcగాక దానికేమి
మిడతలు చిచ్చుపై వడి నెంతయెగసిన
దామె పొక్కెడుc గాక దాని కేమి
వలc బడ్డ మీ నెంత వడి దాcక బొరలిన
దనుcజుట్టు కొనుcగాక దానికేమి



తే.గీ. యెదిరి సత్త్వంబు తన సత్త్వమెఱుcగలేక
పోరువాcడెందున వివేకబుద్ధి యంద్రు
కలిత లక్ష్మీశ, సర్వజగన్నివేశ
విమల రవికోటిసంకాశ వేంకటేశ ! 7

(వేంకటేశ శతకం)

ఆ.వె. చదువు జీర్ణమైన స్వాంతంబు పండును
తిండి జీర్ణమైన నిండు బలము
చెఱుపు గూర్చు రెండు జీర్ణముల్గాకున్న
విశ్వహిత చరిత్ర వినర మిత్ర 8

(మిత్ర సాహస్రి)

© SCERT not to be republished

## కవుల పరిచయం

| కవుల పేర్లు | కాలం | శతకం |
|---|---|---|
| మారద వెంకయ్య | 17వ శతాబ్ది | భాస్కర శతకం |
| మూలం - భర్తృహరి | 7వ శతాబ్ది | సుభాషిత త్రిశతి |
| అనువాదం - ఏనుగులక్ష్మణకవి | 18 శతాబ్ది | సుభాషిత రత్నావళి |
| కంచర్ల గోపన్న (రామదాసు) | 17వ శతాబ్ది | దాశరథీ శతకం |
| మూలం - నీలకంఠదీక్షితులు | 17వ శతాబ్ది | సభారంజన శతకం |
| అనువాదం - ఏలూరిపాటి అనంతరామయ్య | 20 శతాబ్ది | |
| ధూర్జటి | 16వ శతాబ్ది | శ్రీకాళహస్తీశ్వర శతకం |
| తాళ్ళపాక పెద్ద తిరుమలాచార్యులు | 16వ శతాబ్ది | వేంకటేశ శతకం |
| కొండూరు వీర రాఘవాచార్యులు | 20వ శతాబ్ది | మిత్ర సాహస్రి |

### ప్రక్రియ - శతకం

వందకు పైగా పద్యాలు గల రచన శతకం. ప్రతి పద్యం చివర మకుటం ఉంటుంది. ప్రధానంగా శతకాలు నీతి, భక్తి వైరాగ్యాలను బోధిస్తూంటాయి.

© SCERT not to be republished

## భావాలు

1. భాస్కరా! కీర్తిని కోరే గుణవంతుడు తనకు ఎలాంటి లాభాన్నీ ఆశించడు. లోకానికి మేలు జరిగే కార్యమెంత భారమైనా చేయడానికి పూనుకుంటాడు. ఆదిశేషుడు గాలిని మాత్రమే మేస్తూ తన వేయిపడగలమీద ఈ పెద్ద భూభారాన్ని నిత్యం మోస్తున్నాడు కదా!

2. భాస్కరా! ఎంత చదువు చదివినా, అందులోని అంతరార్థాన్ని, మనోజ్ఞతను గ్రహించలేనప్పుడు ఆ చదువు వ్యర్థం. దాన్ని గుణవంతులు మెచ్చుకోరు. ఎన్ని పదార్థాలు వేసి బాగా వంట చేసినా దానిలో తగినంత ఉప్పు లేకపోతే అది రుచించదు కదా!

3. బంగారుహారాలు ధరించడం. సిగలో పువ్వులు పెట్టుకోవటం. సుగంధద్రవ్యాలు వాడటం, పన్నీటితో స్నానంచేయడం, మొదలైనవి మానవుడికి అలంకారాలు కావు. సంస్కారవంతమైన మాటే నిజమైన అలంకారం. మిగిలిన అలంకారాలు నశించిపోయేవే.

4. తన దురదను పోగొట్టుకోవడానికి ఏనుగు, నోటిరుచి ఆశించి చేప, రాగానికి లొంగి పాము, అందానికి బానిసయై జింక, పూల వాసనలకు మైమరచి తుమ్మెదలు బందీలవుతున్నాయి. ఇలా ఒక్కొక్క ప్రాణీ ఒక్కొక్క ఇంద్రియ చపలత్వం వల్లనే నశిస్తూన్నాయి. ఈ పంచేంద్రియ చాపల్యం గల నేను ఎలా బయటపడగలను? ఓ రామా! కరుణాసాగరా! నీవే నన్ను కాపాడాలి.

5. ఎవరు ప్రయత్నంతో క్షమను (ఓరిమిని) కాపాడుకొంటారో, వారు క్షమను (భూమిని) కాపాడతారు. ఎవరిలో క్షమ (సహనం) నిశ్చలంగా ఉంటుందో, వారు అన్ని పనుల్లోనూ క్షములై (సమర్థులై) ఉంటారు.

6. శ్రీకాళహస్తీశ్వరా! తినడానికి అడిగితే ఎవరైనా ఇంత బిచ్చం పెడతారు. నివసించడానికి గుహలున్నాయి. వస్త్రాలు వీధుల్లో దొరకుతాయి. తాగడానికి నదులలో తియ్యనినీరు ఉంది. మానవులను కాపాడడానికి నీవున్నావు. అయినా ఈ ప్రజలు రాజులను ఎందుకు ఆశ్రయిస్తున్నారో తెలియడం లేదు.

7. ఓ వేంకటేశ్వరా! నీవు లక్ష్మీసమేతుడివి. లోకమంతటా నిండి ఉన్నవాడివి. కోటి సూర్యుల తేజస్సు కలవాడివి. లోకంలో ఎవరైనా దుర్మార్గుడై సూర్యుని మీద దుమ్మెత్తి పోస్తే అది వాడిమీదే పడుతుంది. కొండతో పొట్టేలు ఢీకొంటే దాని తలే బద్దలౌతుంది. మిడతలదండు మంటల పైకి ఎగిసిపడితే అవే మాడిపోతాయి. వలలో చిక్కుకున్న చేప ఎంత పోరలాడినా మరింతగా బందీ అవుతుంది. ఇలా ఎదుటివాడి బలం తెలియకుండా యుద్ధానికి దిగితే వాడిని అవివేకి అంటారు.

8. లోకక్షేమాన్ని కోరే మిత్రమా! ఒకమాట విను. చదివిన చదువును జీర్ణించుకుంటే మనసు పరిపక్వమౌతుంది. తిన్న తిండి జీర్ణమైతే బలం కలుగుతుంది. ఆ రెండూ జీర్ణం కాకుండా ఉండిపోతే చెరుపు చేస్తాయి.

## ఇవి చేయండి

### I. వినడం - మాట్లాడడం

1. పాఠంలోని పద్యాలను అర్థవంతంగా, రాగయుక్తంగా చదవండి.
2. పద్యాల్లోని నీతిని సొంతమాటల్లో చెప్పండి.
3. 'చదువు జీర్ణం' కావటాన్ని మీరు ఎలా అర్థం చేసుకున్నారో చెప్పండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం

**1. పాఠంలోని పద్యాల ఆధారంగా కింద తెలిపినవాటిని వేటితో పోల్చారో రాయండి.**

(అ) రసజ్ఞత (ఆ) అవివేకం (ఇ) వాక్కు

**2. కింద ఇచ్చిన భావానికి తగిన పద్యపాదం గుర్తించి రాయండి.**

(అ) గొప్పవారు లోకానికి మేలు జరిగే పనులను ఎంత కష్టమైనా చేస్తారు.
(ఆ) పొట్టేలు కొండతో ఢీకొంటే, దాని తల పగులుతుంది.
(ఇ) తిన్నతిండి జీర్ణమైతే బలం కలుగుతుంది.
(ఈ) రసజ్ఞత లేక పోతే గొప్పవాళ్ళు మెచ్చుకోరు.

**3. 'సభారంజన శతకం' లో క్షమ అనే పదాన్ని ప్రతి పాదంలోనూ వాడటం కనిపిస్తున్నది కదా! క్షమను ఏఏ అర్థాలలో ఉపయోగించారో చెప్పండి.**

© SCERT not to be republished

### 4. పాఠంలోని పద్యాల ఆధారంగా తప్పు ఒప్పులు గుర్తించండి.

(అ) రత్నహారాలు మనిషికి నిజమైన అలంకారం. ( )

(ఆ) ఉప్పులేని కూరైనా రుచిగా ఉంటుంది. ( )

(ఇ) సూర్యుని పైకి దుమ్ము ఎత్తి పోస్తే అది పోసిన వాడి మీదే పడుతుంది. ( )

(ఈ) తిండి జీర్ణం కాకపోతే మనకు ఆరోగ్యం. ( )

### 5. పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

(అ) గొప్పవారివల్ల ప్రజలకు కలిగే మేలు ఏమిటి ?

(ఆ) రాజులను ఎందుకు ఆశ్రయించకూడదని కవి భావించాడు?

(ఇ) 'ఎలాంటి చదువు వ్యర్థమని' మీరు తెలుసుకున్నారు?

(ఈ) ఏవేవి అవివేకమైన పనులని ఈ పాఠం ద్వారా తెలుసుకున్నారు? వీటి వల్ల కలిగే ఫలితాలు ఏమిటి?

(ఉ) నిజమైన అలంకారం ఏది?

(ఊ) ఏ ఏ బలహీనతల వల్ల ఏవేవి ఎలా నశిస్తాయి ?

## III.స్వీయరచన

### 1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.

(అ) గొప్పవాళ్ళే లోకహితమైన కార్యాలు ఎందుకు చేస్తారో మీరు ఊహించి రాయండి.

(ఆ) వాక్కు మనిషికి నిజమైన అలంకారమని ఎలా చెప్పగలవు?

(ఇ) సమర్థులు అంటే ఎవరు? సామర్థ్యం ఎలా వస్తుంది.

(ఈ) చదువును మంచికూరతో కవి ఎందుకు పోల్చాడు?

### 2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

(అ) పాఠంలోని పద్యాల్లో ఉన్న నీతిని సొంతమాటల్లో రాయండి.

(ఆ) మంచితనమంటే ఏమిటి? మీరు కొంత మందిలో గమనించిన మంచితనాన్ని గూర్చి రాయండి.

(ఇ) 'సమర్థులకు క్షమ అవసరం' వివరించండి.

## IV. పదజాలం

### 1. కింది వాక్యాల్లో సమానమైన అర్థాన్నిచ్చే పదాలున్నాయి. వాటిని గుర్తించి, వాటి కింద గీతలుగీయండి.

(అ) హృదయం మంచిదైతే అతడు మంచి మనిషి. అతని డెందములో అందరి పట్ల అభిమానమే ఉంటుంది. ఎదలో కల్మషం లేకుండా మాట్లాడిన అతని మాటలకి అందరి చిత్తాలు సంతోషిస్తాయి.

(ఆ) మిడుతలు చిచ్చుపైకి ఎగిసిపడ్డాయి. అడవిలో వహ్ని రగుల్కొన్నది. అగ్నిలో చెయిపెడితే కాలుతుంది.

### 2. కింది పదాలకు వ్యతిరేకార్థకం రాసి, ఈ రెండు పదాలతోనూ సొంత వాక్యాలు రాయండి.

ఉదా – కీర్తి – అపకీర్తి

మంచి పనులు చేస్తే కీర్తి వస్తుంది. చెడ్డపనులు చేస్తే అపకీర్తి వస్తుంది.

(అ) అహితం (ఆ) బాగుపడు (ఇ) నిస్సారం (ఈ) ఫలం

© SCERT not to be republished

3. కింది పదాలు చదవండి. ఏవైనా రెండేసి పదాలను ఉపయోగిస్తూ సొంతవాక్యాలు రాయండి.

(అ) **చదువు** (ఆ) చెడిపోవు (ఇ) హారాలు (ఈ) ధనం

(ఉ) దుష్టుడు (ఊ) బలం (ఎ) **మార్గం** (ఏ) చంచలస్వభావం

ఉదా – చదువు జీవితానికి మార్గం చూపుతుంది.

## V. సృజనాత్మకత

'పాఠశాలలో పిల్లలకు 'పద్యాల తోరణం' అనే పోటీ పెట్టారు. ఒకరు పద్యం చదివితే ఇంకొకరు ఆ పద్యంలోని చివరి అక్షరంతో లేదా చివర పదంతో మొదలయ్యే పద్యం చదవాలి. ఈ పోటీలో పిల్లలందరూ పాల్గొనాలని తెలియజేయడానికి ప్రకటన రాయండి. ప్రకటనలో నిర్వహించే తేదీ, స్థలం, సమయం మొదలగు వివరాలు ఉండాలి.

## VI. ప్రశంస

పాఠంలోని పద్యాలలో మీ మనసుకు హత్తుకున్న పద్యాలను గురించి, మీ మిత్రులతో చర్చించండి. మీరు చర్చించిన విషయాలు పది వాక్యాల్లో రాయండి.

(లేదా)

చక్కని నీతులు చెప్పిన శతకకవుల గొప్పతనాన్ని వర్ణిస్తూ ఒక వ్యాసం రాయండి.

## VII. భాషను గురించి తెలుసుకొందాం

1. కింది పదాలను విడదీసి, సంధులు పేర్లు రాయండి

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| (అ) చాలకున్న | = | చాలక | + | ఉన్న | (అ | + | ఉ | ) | (అత్వసంధి) |
| (ఆ) అదేమిటి | = | | + | | ( | + | | ) | ( ) |
| (ఇ) వెళ్ళాలని | = | | + | | ( | + | | ) | ( ) |
| (ఈ) ఒకింత | = | | + | | ( | + | | ) | ( ) |

2. కింది పదాలు చదవండి. పదంలోని చివరి అక్షరం కింద గీత గీయండి.

పూచెను, వచ్చెను, తినెను, చూచెన్, ఉండెన్.

పై పదాలను గమనిస్తే, పదాల చివర 'ను,న్'లు కనిపిస్తాయి. అంటే పదాల చివర నకారం ఉన్నది.
ఈ 'న'కారాన్ని ద్రుతం అంటారు. ఈ చివరన 'న'కారం గల పదాలను ద్రుతప్రకృతికాలు అంటారు. పూచెను, వచ్చెను, చూచెన్, మొదలైనవి ద్రుత ప్రకృతికాలే.

మరికొన్ని ద్రుతప్రకృతాలను రాయండి.

3 కింది వాటిని గమనించండి.

ఉదా – (అ) పూచెన్ + కలువలు = పూచెన్ + గలువలు
(ఆ) దెసన్ + చూచి = దెసన్ + జూచి
(ఇ) చేసెన్ + టక్కు = చేసెన్ + డక్కు
(ఈ) పాటిన్ + తప్పు = పాటిన్ + దప్పు
(ఉ) వడిన్ + పట్టి = వడిన్ + బట్టి

పైన తెల్పిన ఉదాహరణలాగా కింది వాటిని వివరించండి.

చేసెను + తల్లీ, దెసను + చూసి



© SCERT not to be republished

మొదటి ఉదా॥లలో ద్రుతప్రకృతికానికి 'క' పరమైతే, దానికి ఆదేశం (దాని స్థానంలో) 'గ' వచ్చింది.

రెండో ఉదా॥లలో ద్రుతప్రకృతికానికి 'చూ' పరమైతే దానికి ఆదేశంగా 'జూ' వచ్చింది.

అలాగే 'ట'కు ఆదేశంగా 'డ' వచ్చింది. 'త'కు ఆదేశంగా 'ద' వచ్చింది. 'ప'కు ఆదేశంగా 'బ' వచ్చింది.

అంటే

క ⟶ గ చ ⟶ జ ట ⟶ డ త ⟶ ద ప ⟶ బ లు వచ్చాయి.

క,చ,ట,త,ప లకు పరుషాలని పేరు.

గ,జ,డ,ద,బ లకు సరళాలని పేరు.

పై ఉదాహరణలలో భావాన్ని బట్టి సూత్రీకరిస్తే

– ద్రుతప్రకృతికాలకు పరుషాలు పరమైతే సరళాలు ఆదేశంగా వస్తాయి.

ఇప్పుడు కింది ఉదాహరణ చూడండి.

పూచెఁగలువలు (ద్రుతం అరసున్న ( ఁ ) గా మారింది)

ఉదా : పూచెను + కలువలు
- పూచెంగలువలు (ద్రుతం సున్న ( ం ) గా మారింది)
- పూచెన్గలువలు (మీది హల్లుతో కూడడం అంటే సంశ్లేషకావటం)
- పూచెనుగలువలు (ద్రుతం మార్పు చెందకుండా వచ్చింది.)

పై ఉదాహరణ ఆధారంగా సంధి జరిగిన తీరును సూత్రీకరిస్తే

– ఆదేశ సరళానికి ముందున్న ద్రుతానికి బిందుసంశ్లేష విభాషగా వస్తాయి.

అంటే ఒక్కోసారి బిందువు వస్తుంది; ఒక్కోసారి సంశ్లేష వస్తుంది.

### ప్రాజెక్టు పని

శతకపద్యాలలో చెప్పిన నీతులకు సరిపోయే కథలను సేకరించి, కథకు, నీతిపద్యం జోడించి ఆల్బమ్ తయారు చేయండి.

© SCERT not to be republished

### నేనివి చేయగలనా ?

1. పద్య భావాలు సొంతమాటల్లో చెప్పగలను. ఔను / కాదు
2. పద్యాలను రాగయుక్తంగా, భావయుక్తంగా చదవగలను. తప్పులు గుర్తించగలను. ఔను / కాదు
3. నీతుల గురించి, మంచితనం గురించి సొంత మాటల్లో రాయగలను. ఔను / కాదు
4. పద్యాల పోటీ కోసం నోటీసు తయారు చేయగలను. ఔను / కాదు

తమ్ముడు తనవాడైనా, ధర్మం సరిగ్గా చెప్పాలి.